క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం శివుడికి రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. గణపతి, అమ్మవారు, సూర్య భగవాన్, విష్ణుమూర్తి స్వాములకు ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో స్వామివారికి అష్టోత్తర అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మాడభూషి అజయ్ కుమార్ శర్మ, భక్తులు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

దోమలపెంట: రెండో మాస శివరాత్రి పురస్కరించుకుని సోమవారం దోమలపెంటలోని శివాలయంలో దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి రామాంజనేయ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



మన్ననూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ బార్డర్ చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం చెరువుకొమ్ము లింగమయ్య స్వామి సమీపంలోని అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ స్పెషల్ టీమ్(ఎస్ఎస్‌టీ) అమ్రాబాద్ సర్కిల్‌కు చెందిన పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

లింగాల: మండలంలోని కోమటికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సి రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రెండు పర్యాయాలు గ్రామ సర్పంచుగా పని చేసిన ఆయన గ్రామాభివృద్ధికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఆయన మరణంలో గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం అంత్యక్రియలకు హాజరయ్యారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ అబద్ధాలను తిప్పికొట్టాలి

కల్వకుర్తి రూరల్: బీఆర్ఎస్, కాంగ్రెస్ అబద్ధాలను బీజేవైఎం కార్యకర్తలు తిప్పికొట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ పిలుపునిచ్చారు. సోమవారం కల్వకుర్తిలో పార్లమెంట్ స్థాయి బీజేవైఎం పార్లమెంట్ స్థాయి కార్యకర్తల యువ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని మట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను జీర్ణంచుకోలేక ప్రధాని మోడీ ఏమీ చేశారని, రాజ్యాంగం మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని తప్పుడు ప్రచారాలకు తెర లేపారని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ విజయం కోసం నిరంతరంగా పనిచేద్దామని కోరారు. కార్యక్రమంలో అభిలాష్ రెడ్డి, కండె సాయి, రాంభూపాల్‌రెడ్డి, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తోపాటు పెద్ద సంఖ్యలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసి, బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తులపై గత నెల 27న కేసు నమోదైంది. నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన నిందితులు నీలా బాయి, హన్మంతును సోమవారం అరెస్టు చేసి అచ్చంపేట సివిల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చారు. జడ్జి సూచనమేరకు రిమాండ్‌కు తరలించినట్లు అచ్చంపేట ఎస్ఐ రాము తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ద్వారం ఎదుట నిల్చొన్న మహిళపై ఆర్టీసీ బస్సు వెళ్లడంతో మహిళకు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన సాతాని లక్ష్మీదేవమ్మ(55) బస్టాండ్ ప్రధాన ద్వారం ఎదుట మూలమలుపు వద్ద నిల్చొని ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు మహిళపైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవమ్మ ఎడమకాలు తెగిపోయింది. స్థానికులు ఆమెను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇక 'పోల్‌చీటీ'

- ఓటరు స్లిప్‌ల పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు
- 9వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశాలు



ఉప్పునుంతలలో ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

అచ్చంపేట: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఇటు ఎన్నికల అధికార యంత్రాంగం, అటు ఎన్నికల సంఘం సర్వ సిద్ధం చేస్తోంది. జిల్లాలో అవసరమైన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ సిబ్బంది, ఎన్నికల అధికారుల నియమాకం, పోస్టల్ బ్యాలెట్ల సరఫరా, హోం ఓటింగ్, ఓటర్ల తుది జాబితాను ఇది వరకే ప్రకటించింది. తాజాగా ఎన్నికలకు ముందు ఓటర్లకు పంపిణీ చేసే ఓటరు స్లిప్(పోల్‌చీటీ)లను కూడా జిల్లాకు సరఫరా చేసింది. ఓటర్లకు అందజేసే పోల్ చీటీలను బీఎల్ఓలకు అందజేశారు. పార్లమెంట్ వారీగా తీసుకెళ్లాలని సర్క్యులర్‌లో పేర్కొనడంతో ఆయా జిల్లాల అధికారులు సరఫరా చేశారు. ఇందులో భాగంగా జిల్లా ఎన్నికల సిబ్బంది మూడు రోజుల నుంచి స్లిప్‌లు పంపిణీ ప్రారంభించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 17,38,254 పోలింగ్ చీటీలను ఎన్నికల సంఘం పంపిణీ చేసింది. నాగర్‌కర్నూలు, వనపర్తి, గద్వాల, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ చీటీలను పంపిణీ చేశారు. జిల్లాలకు సంబంధించిన పోల్ చీటీలను జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా సరఫరా చేశారు. మండలాల వారీగా తహసీల్దార్లు ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారుల ద్వారా ప్రతి ఓటరుకు పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. గడువు ముగిసిన తర్వాత మిగిలిన ఓటరు స్లిప్‌లను బీఎల్‌ఓలు తహసీల్దార్‌కు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

9 వరకు పంపిణీ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా జిల్లాల వారీగా సరఫరా చేసిన ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోల్ చీటీల పంపిణీ బాధ్యతను ఎన్నికల సంఘం ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) లకు అప్పగించింది. ఈ నెల 9వ తేదీ వరకు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందుకు బీఎల్‌ఓలు స్వయంగా ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్‌లను అందజేస్తున్నారు. ఈ ఓటరు స్లిప్‌లు కుటుంబ సభ్యులకు మాత్రమే అందజేయాలని ఆదేశాలు ఉండటంతో బీఎల్‌ఓలు ఆదిశగా పంపిణీ చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో అందుకు అనుగుణంగా ఓటరు స్లిప్‌లు దిగుమతి చేసుకున్నారు. ఓటరు స్లిప్‌లను బల్క్‌గా పంపిణీ చేస్తే సంబంధిత బీఎల్‌ఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని, డూప్లికేట్ ఓటరు స్లిప్‌లు తయారు చేసి పంపిణీ చేపడితే కేసులు పెడుతామని ఎన్నికల సంఘం ఇదివరకే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో ఓటర్లకు సకాలంలో పోల్‌చీటీలు సరఫరా చేసే విధంగా బీఎల్‌ఓలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఓటర్లకు స్లిప్‌లు సకాలంలో పంపిణీ కాకపోతే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సహకారం తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

అందుబాటులో లేకపోతే

సిబ్బంది ఇళ్లకు వెళ్లిన సమయంలో లేనివారి పోల్ స్లిప్‌లు పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచుతారు. వారితో పాటు చిరునామాలో లేనివారివి, డూప్లికేట్లుగా భావించినవారివి అందుబాటులో ఉంచుతారు. అక్కడ తగిన ఆధారం చూపి పోల్‌చీటీ పొందవచ్చు. పోల్‌చీటీ లేకపోయినా ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల్లో ఏదైనా గుర్తింపు పత్రం చూసినా ఓటరు జాబితాలో పేరుంటే ఓటరు వేయవచ్చు.

జిల్లాకు 17.38 లక్షల చిటీలు..

ప్రతి ఓటరుకు ఎన్నికల సంఘం అందజేసే ఓటరు స్లిప్పు(పోల్‌చీటీ) ఓటరు ఫొటో, పేరు, చిరునామా, వయస్సు, గ్రామం, నియోజకవర్గం, జిల్లా తదితర వివరాలు ఉంటాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 8, 64,869 మంది పురుషులు, 8,73,340 మంది మహిళలు, ఇతరులు 45 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితాకు ముందే పోల్‌చీటీల వివరాలు అడగడంతో అందుకు అనుగుణంగా ఓటరు స్లిప్పులను జిల్లా ఎన్నికల యంత్రాంగానికి ఈసీ పంపించారు. గత నెల 15 తర్వాత విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం ఓటరు సిప్లిలు అందజేశారు. వీటిని నియోజకవర్గాల వారీగా పంపిణీ చేపట్టారు. అధికారులు ప్రతిపాదించిన వాటి కంటే ఎన్నికల సంఘం ఎక్కువ ఓటరు ఫ్లిప్పులను పంపించడంతో కొరత రాకుండా ఉంది.

ప్రజా సమస్యలు పట్టించుకోని బీఆర్ఎస్



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సిద్ధాపూర్ బీఆర్ఎస్ నాయకులు



జూపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజల సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ కనుమరుగయ్యిందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో గ్రామ సీనియర్ నాయకుడు బిక్కుమాండ్ల మనోహర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో తూటిపల్లి మల్లయ్య, మద్దూరి లింగస్వామి, సురేష్, లచ్చినారి, అంజి, రవి, లాల్‌కృష్ణ, నారయ్యతో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిక్కుమాండ్ల మనోహర్, భారతయ్య, ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి నాగర్‌కర్నూల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొండోజు రవీంద్రాచారి పేర్కొన్నారు. స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, వీరోజు చంద్రమౌళి, జి పాండుచారి, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కె నాగరాజు, డి రమాకాంత్, మణ్ణెం, కేశవాచారి, కపిలవాయి గోపిచారి, ధర్మాచారి పాల్గొన్నారు.

మన్ననూర్: డాక్టర్ మల్లు రవికే ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని మాలలు మద్దతు ఉంటుందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, తుర్కలపల్లిలో దశరథం, సహదేవ్, తిమ్మాయిపల్లిలో జైపాల్, నాగర్జున, మండలంలోని జూపల్లిలో కాంగ్రెస్ నాయకులు, వెంకటయ్య యాదవ్, మస్తాఫా, రామచంద్రి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ప్రచారం చేపట్టారు.

బల్మూర్: మండలంలోని కొండనాగులలో ఎంపీపీ వేనేపల్లి అరుణ, మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. వెంకట్‌రెడ్డి, ఎల్లికంటి శ్రీనువాసులు, మశన్న, రామస్వామిగౌడ్, బిచ్చన్న, అశోక్, కిరణ్‌కుమార్, జహంగీర్, సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలపెంట: దోమలపెంట, ఈగలపెంట, ఎడమ పాతాళగంగ ప్రాంతాల్లో కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు మల్లురవికి మద్దతుగా ప్రచారం చేశారు. సీఐటీయూ నాయకులు వి.కిషన్, కోటయ్య, ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీటీసీ మల్లిఖార్జున, మోయిజుద్దీన్, పార్థసారథి యాదవ్, కుమార్, ఇజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ దివ్యాంగుల జేఏసీ కన్వీనర్ నాగేశ్వర్‌రావు మద్దతు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి స్వగృహంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే దివ్యాంగుల సంక్షేమం సాధ్యమన్నారు. సమావేశంలో నాగభూషణం, భీమ్‌సాగర్, రామ్ పాల్గొన్నారు.

లింగాల: మండలంంలోని రాయవరం గ్రామ పంచాయతీకి చెందిన 40 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నిలదీసేది బీఆర్ఎస్ ఒక్కటే



ఖానాపూర్‌లో ప్రచారం చేస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి



గట్టురాయిపాకులలో..

బిజినేపల్లి: కాంగ్రెస్‌ను నిలదీసేది బీఆర్ఎస్ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గట్టురాయిపాకుల, గట్టునెల్లికుదురు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అర్థం రవి, లక్ష్మయ్య, సుబ్బయ్య, శ్రీను, వెంకటేష్, బాబుగౌడ్, చంద్రారెడ్డి, సుభాష్, భీమయ్య, వెంకటేష్, దామోదర్‌రెడ్డి, మాధవరెడ్డి, సత్యం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సారంబండతండాలో ప్రచారం చేశారు.

వెల్దండ: మండలంలోని రాచూర్, కుప్పగండ్ల, పెద్దాపూర్, చెదురుపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాచూర్‌లో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, హైజాక్, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, నాయకులు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

అమ్రాబాద్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీఓ రఘు కోరారు. సోమవారం మండలంలోని మాధవానపల్లిలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కు, ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీఓ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ రవిందర్‌నాయక్, కూలీలు పాల్గొన్నారు.

వ్యక్తికి కౌన్సెలింగ్



పెద్దకొత్తపల్లి: చంద్రకల్ గ్రామానికి చెందిన వనపట్ల జమదగ్ని భార్య వసంత గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రాలేదని మనస్తాపంతో సోమవారం జమదగ్ని భార్యకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. ఈ విషయాన్ని బంధువులు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ వెంటనే స్పందించి నాగర్‌కర్నూల్ ఐటీ కోర్ టీం సభ్యుల సహాయంతో జమదగ్ని తిమ్మాజిపేట ఏరియాలో ఉన్నట్లు గుర్తించి అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. జమదగ్నికి కౌన్సెలింగ్ ఇచ్చి అతని సోదరుడికి అప్పగించారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం



కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు సోమవారం నుంచి ప్రారంభయ్యింది. పట్టణంలోని మినీ స్టేడియంలో విద్యార్థులను ఉద్దేశించిన ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ మాట్లాడారు. స్పోర్ట్స్, అథ్లెటిక్స్‌తో పాటు విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగించే అంశాలకు క్యాంపులో ప్రాధాన్యం ఇస్తామన్నారు. నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి తెలపాలి

కల్వకుర్తి టౌన్: రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి తెలపాలని టీపీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. బీజేపీ మత ప్రాతిపదికన రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలని చూస్తుందని ఆరోపించారు. కుల ప్రాతిపదికన ఉన్న రిజర్వేషన్లకు తీసివేసే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందాలను చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రఘు, ఆనంద్, శ్రీకాంత్, హన్మా నాయక్, వెంకటేష్, సీఐటీయూ నాయకులు ఏపీ మల్లయ్య, ఆంజనేయులు, సురేష్, దాస్యలు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకుసాగాలి



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకుసాగాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో సోమవారం మంత్రి కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షకుడు పీవీ మోహన్‌తో కలిసి ఎన్నికల ప్రచారంపై చర్చించారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని మంత్రి జూపల్లి సూచించారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు



తెలకపల్లిలో ధాన్యాన్ని కొనుగోలు కేస్తున్న ఐకేపీ సిబ్బంది

తెలకపల్లి: రైతులు పండించిన వరిధాన్యాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్లను కొనుగోలు చేస్తున్నామని ఏపీఎం నిరంజన్ అన్నారు. దాసుపల్లి, రాంరెడ్డిపల్లి, పర్వతాపూర్, రాకొండ గ్రామాలకు సంబంధించిన రైతులు తెలకపల్లి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. మొదటి రకం రూ.2203, సాధారణ రకం రూ.2183ల మద్దతు ప్రభుత్వం కల్పించిందన్నారు. మండల పరిధిలోని 7 గ్రామ సంఘాలు కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నాయని, పెద్దూరు, గట్టునెల్లికుదురు, గట్టురాయిపాకుల, గౌతం పల్లి, తెలకపల్లి, కార్వంగ, నడిగడ్డ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 960 బస్తాలు, 384 క్వింటాళ్ల కొనుగోలు చేశామన్నారు. ఆయన వెంట సీసీ నర్సింహా, నిరంజన్, వీఓఏలు ఫరాత్ బేగం, భార్గవి, శ్రీనిధి, కృష్ణయ్య, కుమ్మరి చిన్నయ్య, అబ్బాస్ తదితరులు ఉన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బల్మూర్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి హితువు పలికారు. సోమవారం మండలంలోని అనంతవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు 2017లోనే ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు అనుమతులు వచ్చాయని కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలతో రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు తెలియకుండానే సర్వేలు చేయించింది ఎవరు మరిచిపోలేదని ప్రజలు చిత్తుగా ఓడించినా మార్పురాలేదని విమర్శించారు. మైలారం గుట్టపై మైనింగ్ అనుమతుల కోసం డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. మాజీ సర్పంచ్‌లు నర్సింగ్‌రావు, సుధాకర్‌గౌడ్, శ్రీనువాసులు, మాజీ ఎంపీటీసీ ఖదీర్, నాయకులు శైలేష్, మశన్న, రమేష్, బాల్‌రాంనాయక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



సింగోటంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్ రూరల్: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మండల అధ్యక్షుడు సాయి కృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం మండంలోని సింగోటంలో నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలలో అవినీతి రహిత పాలన సాగిందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీతోనే దేశ భద్రత సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. కూరగాయల సంతలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి బాబూసాగర్, గుండూరు రాము, గోపస్ చందు, భానుగౌడ్, వెంకట్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఎస్పీ ప్రచారం



చందుబట్లలో ప్రచారం చేస్తున్న జిల్లా కమిటీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని చందుబట్ల, పెద్దముద్దునూరు, వనపట్ల, గన్యాగుల, తదితర గ్రామాల్లో బీఎస్పీ ఎంపీ అభ్యర్థి బీసమోల్ల యోసోఫ్‌కు మద్దతుగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఉపాధి కూలీల వద్దకు చేరుకొని ఎంపీగా యోసోఫ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. బీఎస్పీతోనే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని వివరించారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



నర్సరీని పరిశీలిస్తున్న చంద్రసిద్ధార్థ్

తాడూరు: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ చంద్రసిద్ధార్థ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు యంగంపల్లి, గుంతకోడూరు, ఇంద్రకల్ గ్రామాలలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున ప్రతి రోజు నర్సరీలలోని మొక్కలకు ఉదయం, సాయంత్రం నీటిని అందించాలన్నారు. నర్సరీపై గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు మొక్కల రక్షణపై అవగాహన కల్పించారు. క్షేత్రసహాయకులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని కోరారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న చైర్మన్ భాస్కర్‌రావు

వెల్దండ: దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయంలో డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంక్‌ను ఆర్థికంగా మరింత అభివృద్ధి కోసం రైతులు సహకరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులకు డైరెక్టర్లు అవగాహన కల్పించి రుణాలను చెల్లించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, శేఖర్‌ముదిరాజ్, రాఘవేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, తదితరులు ఉన్నారు.

బీజేపీతో ఒరిగిందేమిలేదు



మాట్లాడుతున్న పర్వతాలు

కొల్లాపూర్: బీజేపీతో ఒరిగిందేమిలేదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు విమర్శించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం కలుగుతుందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు బాలపీరు, సేవ్యానాయక్, సురేందర్, సాయిప్రసాద్, భాష, సత్యం, కార్తీక్, సంజీవ్ తదితరులున్నారు.